క్లుప్తంగా

సజావుగా సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, అధికారులు

చిలమత్తూరు: మండల సర్వసభ్య సమావేశం సోమవారం సజావుగా సాగింది. ఎంపీపీ పురుషోత్తమరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో కేవలం తాగు నీటి సమస్యలపై మాత్రమే చర్చ జరిగింది. ఎంపీడీఓ రామ్‌కుమార్ మాట్లాడుతూ తాగు నీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించామని, ప్రస్తుతం తమ దృష్టికి వచ్చిన గ్రామాలలో కూడా నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

హిందూపురం: మండలంలోని కగ్గల్లు గ్రామంలో సోమవారం శివాలయంలో శివలింగం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని దేవుడిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే అభ్యర్థి టిఎస్.దీపిక తెలిపారు.

సచివాలయ ఉద్యోగికి షోకాజ్ నోటీసులు

చిలమత్తూరు: మండల కేంద్రంలోని చిలమత్తూరు–1 సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తోన్న విజయ్ ఈనెల 13న కొత్తచెరువులో ఎమ్మెల్యే బాలకృష్ణ నిర్వహించిన టీడీపీ ప్రచారంలో పాల్గొన్నాడు. దీనిపై ఫిర్యాదులు అందడంతో అధికారులు షోకాజు నోటీసు జారీ చేశారు.

జగన్‌తోనే ముస్లిం మైనార్టీల సంక్షేమం



ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ముస్లిం, మైనార్టీ నాయకులు

హిందూపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ముస్లిం, మైనార్టీల సంక్షేమం సాధ్యమని మున్సిపల్ వైస్‌చైర్మన్ జబీవుల్లా, మాజీ ముతవల్లీలు కలీముల్లా, అజీజ్ సాబ్, సానీ ముతవల్లీ హుమయూన్ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు సోమవారం హిందూపురం నియోజకవర్గంలోని కొడికొండ పంచాయతీలో ఇంటింటి ప్రచారం సాగించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎస్.దీపిక, ఎంపీ అభ్యర్థి బి.శాంతమ్మలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

మట్టి తరలింపుపై కేసు నమోదు

లేపాక్షి: మండలంలోని ఉప్పరపల్లి గ్రామ చెరువులో అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోపి సోమవారం తెలిపారు. ఐదు ట్రాక్టర్లు, జేసీబీని స్టేషన్‌కు తరలించామన్నారు.

మేడేను జయప్రదం చేయండి

హిందూపురం టౌన్: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మే 1న నిర్వహిస్తున్న మేడే వేడుకలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్, జిల్లా కోశాధికారి బాబులు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వారు ఏఐటీయూసీ పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు.

ఏఆర్ రొప్పంలో ఎన్నికల ప్రచారం

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఏఆర్ రొప్పం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సంక్షేమాభివృద్ధిని వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. రంగప్ప, బీరప్ప, జాజప్ప, రవి కుమార్, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

పాల ట్యాంకర్ బోల్తా



మరవకొత్తపల్లి వద్ద బోల్తా పడిన పాల ట్యాంకర్

చిలమత్తూరు: మండలంలోని 544ఈ జాతీయ రహదారి మరవకొత్తపల్లి బీసీ కాలనీ వద్ద సోమవారం తెల్లవారుజామున పాల ట్యాంకర్ బోల్తా పడింది.10 వేల లీటర్లు పాలతో వెళ్తున్న లారీ అతివేగం కారణంగా అదుపుతప్పింది. డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. అయితే పాలన్నీ నేలపాలయ్యాయి. పోలీసులు ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

విశ్వసనీయతకు మారుపేరు జగన్

- అన్ని వర్గాలకు మేలు చేసేలా వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో
- బాబు ప్రజల నమ్మకాన్ని కోల్పోయారన్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్.దీపిక, చిత్రంలో వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ

హిందూపురం: 'ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగనే. చెప్పిందే చేస్తారు... చేసేదే చెబుతారు'అని హిందూపురం వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి టిఎన్.దీపిక అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక, వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాదయాత్రలో పేదలతో పాటు అన్ని వర్గాల కష్టాలు, కన్నీళ్లు ఇబ్బందులు కళ్లారా చూసిన జగనన్న సకల జనుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్నివర్గాలకు మరింత మేలు చేసే విధంగా మేనిఫెస్టో రూపొందించారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు మరింత అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయంగా జగనన్న జనరంజక మేనిఫెస్టోను ప్రకటించారని చెప్పారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని దాదాపుగా సీఎం జగన్ నెరవేర్చి విశ్వసనీయతను మారుపేరుగా నిలిచారని కొనియాడారు. టీడీపీ మేనిఫెస్టోలో చంద్రబాబు పొందుపర్చినవన్నీ అమలు చేయలేని అబద్ధపు హామీలేనని వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి టీఎస్.దీపిక, వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ విమర్శించారు. జగనన్నను ఎదుర్కోలేక అన్ని పార్టీలు ఏకమై వస్తున్న చంద్రబాబుపై ప్రజల్లో మాత్రం నమ్మకం లేదన్నారు. సూపర్ 6 పేరుతో ప్రజలను మోసం చేసేందుకు అలవికాని హామీలతో ముందుకు వస్తున్నారని చెప్పారు. ప్రజలకు ఇన్నీ సంక్షేమ పథకాలు ఇస్తే శ్రీలంక అవుతుందని చెప్పిన చంద్రబాబు... ఇప్పుడు జగనన్న ప్రభుత్వం కన్నా రెండింతలు సంక్షేమ ఫలాలు ఎలా ఇస్తారో చెప్పాలని ప్రశ్నించారు. చంద్రబాబు మాటలన్నీ నీటిమీద రాతలేనని ధ్వజమెత్తారు. చంద్రబాబు వస్తే వర్షాలు లేక కరువు పునవృతం అవుతుందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు మన్సూర్, రాము, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న పాలనకే జనం జై కొడుతున్నారు

- బీసీ కార్పొరేషన్ల కోఆర్డినేటర్ ప్రవీణ్



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపికను కలసిన బీసీ కార్పొరేషన్ల కోఆర్డినేటర్ ప్రవీణ్

హిందూపురం: జగనన్న సంక్షేమ పాలననే ప్రజలందరూ కోరుకుంటున్నారని 56 కులాల బీసీ కార్పొరేషన్ల కోఆర్డినేటర్ ప్రవీణ్ అన్నారు. సోమవారం హిందూపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి విచ్చేసి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి టీఎస్.దీపిక మర్యాదపూర్వకంగా కలిసి ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించి అవసరమైన సూచనలు చేశారు. హిందూపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేయాలన్నారు.

మడకశిరలో టీడీపీకి బిగ్‌షాక్

- పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకుల రాజీనామా



టీడీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిస్తున్న నాయకులు

మడకశిర: మడకశిరలో టీడీపీకి బిగ్ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన ప్రముఖ నాయకులు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పట్టణంలోని మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణంలో సోమవారం టీడీపీ నాయకులు సమావేశమై రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రకాశ్, మాజీ ఎంపీపీలు ఆదినారాయణ, బజ్జప్ప, నియోజకవర్గ ప్రముఖులు సురేష్, జయరామిరెడ్డి, రాజగోపాల్, క్రిష్టప్ప తదితరులు రాజీనామా చేసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన టీడీపీ నాయకులు విలేకర్లతో మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు తొలుత సునీల్‌కుమార్‌కు టికెట్ ఇచ్చి ఆ తర్వాత ఎంఎస్ రాజుకు టికెట్ ఇవ్వడంతోనే తామంతా మాజీ ఎమ్మెల్యే ఈరన్న తనయుడు సునీల్‌కుమార్‌కు అండగా నిలబడ్డామన్నారు. అయితే ఈరన్న, సునీల్‌కుమార్ కూడా సూట్ కేస్‌లకు అమ్ముడుబోయి ఎన్నికల బరి నుంచి తప్పుకుని మోసం చేశారని విమర్శించారు. ఈరన్న, సునీల్‌కుమార్ ఇద్దరూ నమ్మక ద్రోహం చేశారని ధ్వజమెత్తారు. తాము ఎట్టి పరిస్థితిలో టీడీపీలో ఉండమని తేల్చిచెప్పారు త్వరలోనే తామందరూ ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు.

చంద్రబాబుతో రఘువీరారెడ్డి కుమ్మక్కు

- టీడీపీని గెలిపించడమే ఆయన లక్ష్యం
- మాజీ మంత్రి రఘువీరపై వైఎస్సార్‌సీపీ నాయకుల ఆగ్రహం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర: టీడీపీ అధినేత చంద్రబాబుతో మాజీ మంత్రి రఘువీరారెడ్డి కుమ్మక్కయారని వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్, మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్ రవిశేఖర్‌రెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జ్ అనంతరాజు, ఏడీసీసీ బ్యాంకు మాజీ ఉపాధ్యక్షుడు ఆనందరంగారెడ్డి , రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షుడు కాంతరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్ విమర్శించారు. వారు సోమవారం మాజీ ఎమ్మెల్యే వైటీ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. టీడీపీని గెలిపించడానికి రఘువీరారెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. రాజకీయ ఎత్తుగడలో భాగంగా టీడీపీని గెలిపించడానికి ప్రజలకు మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థి సుధాకర్‌ను బలిపశువు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నో ఏళ్లు మంత్రిగా పని చేసిన రఘువీరారెడ్డి ప్రజలకు చేసింది శూన్యమన్నారు. శ్రీరామరెడ్డి తాగునీటి పథకం పనులను నాసిరకంగా చేసిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. ఆరు నెలల్లో మడకశిర మీదుగా బెంగళూరుకు రైల్వేలైన్ పనులను పూర్తి చేయడం సాధ్యం కాని పనన్నారు. వైఎస్ జగన్ హయాంలోనే మడకశిరలో పారిశ్రామికవాడ అభివృద్ధికి బీజం పడిందన్నారు. పారిశ్రామిక వాడ ఏర్పాటుకు సేకరించిన భూములకు రూ.25.25 కోట్ల నష్ట పరిహారాన్ని బాధిత రైతులకు అందించారని గుర్తు చేశారు. మడకశిర ప్రాంతానికి వేగంగా కృష్ణాజలాలు అందించడానికి రూ.215 కోట్లతో బైపాస్ కెనాల్ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. మడకశిర టీడీపీ నాయకులు రూ.వేల కోట్లు అక్రమంగా సంపాదించారని ఆరోపించారు. రోడ్డు విస్తరణలో మడకశిర పట్టణంలోని దళితులకు అన్యాయం చేసిన ఘనత టీడీపీ వారిదేనని విమర్శించారు. మడకశిర టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజుకు ఈ ప్రాంతంపై ఏమాత్రం అవగాహన లేదన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదనే విషయాన్ని ప్రజలు గ్రహించాలని కోరారు.

గడ్డి కేంద్రం పరిశీలన

పావగడ: తాలూకాలోని నాగలమడక గ్రామం సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసిన గడ్డి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శుభ కళ్యాణ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె గడ్డి కొనుగోలుకు వచ్చిన రైతుతో మాట్లాడారు. గడ్డి కేంద్రం వద్ద తాగు నీరు, అగ్ని మాపక దళం తదితర అవసరమైన సౌలభ్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ఒక కేజీ గడ్డి రూ 2 ధరతో విక్రయిస్తున్నామని తెలిపారు.

'మేం పార్టీ మారలేదు'

అమరాపురం: మండల పరిధిలోని నగోనపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఉద్దన్న, కుబేరప్ప, సిద్దరామప్పలు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరినట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీంతో స్పందించిన మండల వైస్ ఎంపీపీ లలితమ్మ కుమారుడు రంజిత్‌కుమార్, తమ్మడేపల్లి సర్పంచ్ భర్త సదానందగౌడ్‌లు నగోనపల్లి గ్రామానికి వెళ్లి నాయకులతో మాట్లాడారు. తాము పార్టీ మారలేదని, బలవంతంతో కండువాలు వేశారని తెలిపారన్నారు. తాము వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతున్నట్లు వారు తెలిపారు.

ఈరలక్కప్ప గెలుపునకు కృషి



మహిళా కార్యకర్తల ప్రచారాన్ని ప్రారంభిస్తున్న నాయకులు



మడకశిరలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న పోకల అశోక్‌కుమార్, ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

మడకశిరరూరల్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప గెలుపులో మహిళా కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని పార్టీ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి సూచించారు. సోమవారం చెండకచెర్ల ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు మద్దతుగా మహిళా కార్యకర్తల ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని వారు జెండా ఊపి ప్రారంభించారు. మండల కన్వీనర్ రామిరెడ్డి, మహిళా కార్యకర్తల టీమ్ సభ్యులు వైసీ నందన, కవిత, సరోజమ్మ, గీత, జయపద్మ, తదితరులు పాల్గొన్నారు.

అగళి: మండల పరిధిలోని పీ బ్యాడగేర పంచాయతీలో మహిళా కార్యకర్తల ప్రచారాన్ని నియోజకవర్గం పరిశీలకులు పోకల అశోక్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నేత్రావతి, ఎంపీపీ భర్త కామరాజు, సర్పంచ్ రామకృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

మడకశిరలో ప్రచారం

మడకశిర: వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, ఈరలక్కప్పకు ఓటు వేసి గెలిపించాలని పార్టీ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్ ప్రజలను కోరారు. ఆయన సోమవారం ఆయన పట్టణంలోని 1,8 వ వార్డుల్లో అసెంబ్లీ అభ్యర్థి ఈరలక్కప్ప, పార్టీ నాయకులతో కలసి జోరుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ విస్మరించి ప్రజలను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. మరోసారి ఆయన్ను నమ్మొద్దని సూచించారు. మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్ రవిశేఖర్‌రెడ్డి, రంగేగౌడ్, పట్టణ కన్వీనర్ పుట్ట కామప్ప, జేసీఎస్ కన్వీనర్ విక్రమ్ , మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, కౌన్సిలర్లు అంజన్ కుమార్‌యాదవ్, అన్సర్, అక్రమ్,నాగేంద్ర, దాసన్న,మేఘన రమేష్, శ్రీనివాస్, సతీష్‌రెడ్డి, తిమ్మక్క, సిద్ధప్ప, కోఆప్షన్ సభ్యులు క్రిష్ణమూర్తి, ఫక్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు టీడీపీకి లేదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప



డీ గొల్లహట్టిలో పూలతో ఈరలక్కప్పకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

మడకశిరరూరల్: గత టీడీపీ ప్రభుత్వ పాలనలో ఎన్నికల హామీలను నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన టీడీపీకి ఓటు అడిగే హక్కు లేదని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, పార్టీ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మెళవాయి, గుండుమల, కదిరేపల్లి పంచాయతీల్లోని గ్రామాల్లో ఇంటింటా జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రోడ్‌షో ద్వారా వృద్ధులు, మహిళలు, ప్రజలను అప్యాయంగా పలకరిస్తూ సీఎం వైఎస్ జగన్ ఐదేళ్ల పాలన బాగుందా? 14 ఏళ్లు పాలించిన టీడీపీ పరిపాలన బాగుందా అని ఈరలక్కప్ప అడిగి తెలుసుకొని ప్రచారం చేశారు.

టీడీపీని చిత్తుగా ఓడించండి

ఎన్నికల ప్రచార సభల్లో ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప మాట్లాడుతూ గుండుమల పంచాయతీ అభివృద్ధి చెందిందంటే అది మహానేత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే జరిగిందన్నారు. అందరికీ అందుబాటులో ఉంటున్న తనకు ఒకసారి అవకాశం ఇస్తే మడకశిర ప్రాంతాన్ని మరింతగా అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. నాన్ లోకల్ అయిన టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని శింగనమలలో ఉంటారని ప్రతి రోజు మడకశిరకు వచ్చే అవకాశం ఉండన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటి వద్దకే అందిస్తున్న సంక్షేమ పథకాలు రద్దు చేస్తారని ఈ విషయాన్ని ఓటర్ల గుర్తించాలన్నారు.

జగన్‌తోనే బీసీలకు అగ్రతాంబూలం

మడకశిర మండలం గుండుమలలో ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పను రాష్ట్ర బోయ కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్రా, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ కోఆర్డినేటర్ ప్రవీణ్ కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బీసీల ఆర్థిక సంక్షేమానికి, రాజకీయంగా ప్రాధాన్యత కల్పించి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు.రాష్ట్ర చరిత్రలో బీసీలకు ఎన్నడూఇంతటి గౌరవం దక్కలేదన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు వైఎస్ రవిశేఖర్‌రెడ్డి, రంగేగౌడ్, అసెంబ్లీ ఇన్‌చార్జ్ అనంతరాజు, జిల్లా ఏడీసీసీ బ్యాంకు మాజీ ఉపాధ్యక్షుడు ఆనందరంగారెడ్డి, నాట్య మండలి అకాడమీ డైరెక్టర్ శాలిని, రాష్ట్ర బీసీ విభాగం, యువజన ఉపాధ్యక్షులు కాంతరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శులు జీబీ శివకుమార్, శ్రీరాములు, రొళ్ల మండల మాజీ కన్వీనర్ల డాక్టర్ శివప్రసాద్, తిమ్మప్ప, న్యాయవాది అశ్వత్తనారాయణ, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ల నాగేంద్రయాదవ్, తిమ్మప్ప, తాలుకా యువత బీసీ సెల్ అధ్యక్షులు చంద్రశేఖర్, మండల కన్వీనర్లు పుట్టకామప్ప, త్రిలోక్, రాష్ట్ర ఎస్సీ సెల్ సభ్యుడు హనుమంతరాయ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఉగాది క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ అభ్యర్థి శాంతమ్మ

హిందూపురం టౌన్: క్రోధి నామ సంవత్సర త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్‌ను సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మ ఆవిష్కరించారు. ఎంపీ అభ్యర్థి శాంతమ్మ నివాసంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈరన్న-సునీల్ నామినేషన్ల ఉపసంహరణ

- అండగా నిలిచిన టీడీపీ కార్యకర్తల ఆగ్రహం



కారును అడ్డుకుంటున్న కార్యకర్తలు

మడకశిర: నామినేషన్ల ఉపసంహరణ వేళ టీడీపీలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. టీడీపీ మడకశిర ఎమ్మెల్యే టికెట్‌ను తొలుత మాజీ ఎమ్మెల్యే ఈరన్న తనయుడు సునీల్‌కుమార్‌కు కేటాయించారు. చివరిలో ఎంఎస్ రాజుకు టీడీపీ బీ-ఫాం ఇచ్చారు. అధిష్టాన నిర్ణయంపై ఆగ్రహించిన ఈరన్న, సునీల్ ఇద్దరూ నామినేషన్లు వేశారు. టీడీపీలోని మెజార్టీ కార్యకర్తలు వీరికి మద్దతుగా నిలిచారు. లోకల్ ముద్దు.. నాన్ లోకల్‌వద్దు అంటూ ఆందోళనలు నిర్వహించారు. అయితే సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ జరిగింది. అంతకుముందే టీడీపీ జిల్లా నాయకులు ఈరన్న-సునీల్‌తో మంతనాలు జరిపి వారి నామినేషన్ల ఉపసంహరణకు ఒప్పించారు. ఈ మేరకు తండ్రీ,కొడుకులు తమ కార్యాలయం నుంచి ఆర్‌ఓ కార్యాలయం వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఇద్దరూ స్వతంత్రులుగా బరిలో ఉంటారని భావించిన కార్యకర్తలు.. ఈరన్న-సునీల్ తీసుకున్న నిర్ణయంతో డీలా పడ్డారు. నామినేషన్లు ఉపసంహరించుకోకూడదంటూ వారి కారును అడ్డుకున్నారు. కార్యకర్తల విజ్ఞప్తులను ఏమాత్రమూ పట్టించుకోకుండా ఈరన్న-సునీల్ ఆర్‌ఓ కార్యాలయానికి వెళ్లి తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. నమ్మి వెంట నడిస్తే మరీ ఇంతలా మోసం చేస్తారా అంటూ పలువురు కార్యకర్తలు రగిలిపోతున్నారు. వీరిలో చాలామంది పార్టీ మారడానికి రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం.

నేడు ఎన్నికల ప్రచారం

గుడిబండ: మండల పరిధిలోని కరికెర, హిరేతుర్పి, దాసరపల్లి, ఫళారం, దేవరహట్టి, పీసీ గిరి గ్రామాల్లో మంగళవారం జరిగే వైఎస్సార్‌సీపీ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడ్ ఆ పార్టీ శ్రేణులను కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కన్నేరమ్మకు పూజలు

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లి గ్రామ చెరువు కట్ట వద్ద వెలసిన కన్నేరమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, కన్యలు కన్నేరమ్మదేవికి మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు.

శంకరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో శంకరేశ్వరస్వామి

అగళి: మండల కేంద్రంలోని వెలసిన శంకరేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని అర్చకులు పూలతో ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదం, పానకం, గుగ్గిళ్లను పంపిణీ చేశారు.

నేటి నుంచి గంగమ్మ జాతరోత్సవాలు

పావగడ: పట్టణంలోని మూడు ముఖాల నేల ప్రాంతంలో వెలసిన నల్ల రాళ్ళ గంగమ్మదేవి జాతరోత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 8 న అమ్మవారి పూల రథోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ సమితి అధ్యక్షురాలు చైత్ర లక్ష్మి తెలిపారు.

జూదరుల అరెస్ట్

అగళి: మండల పరిధిలోని రామాపురం గ్రామ పొలిమేరలో జూద కేంద్రంపై సోమవారం రాత్రి పోలీస్ సిబ్బందితో దాడి చేసినట్లు ఎస్‌ఐ వీరేష్ తెలిపారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.7,400 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

'పురం' బరిలో 13 మంది అభ్యర్థులు

హిందూపురం: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ముగింది. మొత్తం 13 మంది అభ్యర్థులు హిందూపురం నియోజకవర్గం అసెంబ్లీ బరిలో నిలిచారని నియోజకవర్గ ఎన్నికల అధికారి, సంయుక్త కలెక్టర్ అభిషేక్‌కుమార్ తెలిపారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల విషయానికొస్తే వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా టీఎస్ దీపిక, టీడీపీ తరపున బాలకృష్ణ, కాంగ్రెస్ తరపున ఇనాయతుల్లాతో పాటు మరో పది మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు పేర్కొన్నారు.

మడకశిరలోనూ 13 మంది...

మడకశిర: మడకశిర అసెంబ్లీ బరిలో 13 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ జరిగింది. మొత్తం 16 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు ఇందులో స్వతంత్ర అభ్యర్థులు కే ఈరన్న, ఎంఈ సునీల్‌కుమార్, ప్రియాంకలు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఈ నేపథ్యంలో 13 మంది అభ్యర్థులు పోటీలో మిగిలారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఈరలక్కప్ప, టీడీపీ నుండి ఎంఎస్ రాజు, కాంగ్రెస్ నుండి సుధాకర్, బీఎస్‌పీ నుంచి ఇందివర్, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి హనుమంతరాజు, స్వతంత్ర అభ్యర్థులుగా కరినింగప్ప, గురుమూర్తి, ధనరాజు, పవిత్ర, రవీంద్ర, రాజన్న, లక్ష్మీనరసప్ప, జగన్నాథ్‌ప్రసాద్ పోటీలో మిగిలారు. స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులను కూడా కేటాయించినట్లు ఆర్‌ఓ గౌరీశంకర్‌రావు తెలిపారు.